ప్రజాశక్తి

గురువారం 6 జులై 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కబ్జాలకు రాజకీయ అండ

- ఎండాడ సర్వే నెంబర్ - 1 ఆక్రమణల పుట్ట
- కళ్లు మూసుకున్న రెవెన్యూ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భూ కబ్జాలకు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండ పుష్కలంగా ఉండడంతో ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో కొంతమంది 'చోటా' నాయకులకు దోచుకోవడమే పనిగా మారింది. ప్రభుత్వ భూమి, చెరువు, గెడ్డ కనిపిస్తే చాలు.. దురాక్రమణకు దిగిపోతున్నారు. రెవెన్యూ, జివిఎంసి యంత్రాంగం చూసీచూడనట్లుగా.. మరీ ఎవరైనా గట్టి ఫిర్యాదులు చేస్తే తూతూ మంత్రంగా సర్వే చేసి రికార్డుల్లోకి రాకుండా నోటిమాటతో ఎదుటి వారిని సమాధాన పరచడం పరిపాటిగా మారింది. ఎండాడలోని సర్వే నెంబర్ - 1 పూర్తి అక్రమాల పుట్టగా మారి పోయింది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురౌతున్నాయి. రుషి కొండలో రూ.300 కోట్ల విలువైన సర్వే నెంబరు 29/1, 29/2లోగల 7 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక నేత చెన్నాదాస్ ఏనాటి నుంచో గుప్పెట్లో పెట్టుకుని రెవెన్యూ యంత్రాంగానికి తృణమో ఫణమో ఇచ్చి దోచుకుని దొరగా చెలామణీ అవుతున్నాడు.

మొగదారమ్మ గుడి వద్ద ఆక్రమణకు గురైన స్థలం

హయగ్రీవ ప్రాజెక్టు దిగువన ఆక్రమిత స్థలంలో చేపడుతున్న పనులు

మొగదారమ్మ గుడి వద్ద తాజా భూ కబ్జా

తాజాగా సాగర్ నగర్ మొగదారమ్మ గుడి వద్దగల ఖాళీ స్థలం సుమారు 200 గజాల ప్రభుత్వ భూమిపై అధికార పార్టీ నేత కన్ను పడింది. దీనిని పక్కాగా జివిఎంసి భూమిగా గుర్తించారు. అయినా రాజకీయ అండతో కబ్జాకు గురవుతోంది. సుమారు రూ.10 కోట్ల విలువైన మొగదారమ్మ గుడి (ఇస్కాన్ సమీపంలో) భూమిని బినామీ పేర్లతో అధికార పార్టీ నాయకుడొకరు ఆక్రమించేస్తున్నట్లు స్థానికంగా ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇక్కడ భూమినంతటినీ యంత్రాలు పెట్టి చదును చేసేశారు. సిసి కెమెరాల నిఘా నీడన రాత్రీ, పగలూ పనులు చేపట్టడం ఈ సర్వే నెంబర్లలో నిరంతరం జరుగుతోంది. స్థానిక రెవెన్యూ సిబ్బందికి తెలిసినప్పటికీ దీనిపై నోరెత్తడం లేదు. మరో వైపు సర్వే నెంబరు 61లోగల సుమారు 67 ఎకరాల గెడ్డను కప్పేసి మిగతా 2లో..

ఫార్మా ప్రమాదాలపై

న్యాయ విచారణ జరపాలి

టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉమ్మడి విశాఖ జిల్లాలో తరుచూ జరుగుతున్న ఫార్మా ప్రమాదాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీలతో నెల మామూళ్ల ఒప్పందం పెట్టుకుని ప్రభుత్వంలోని పెద్దలు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల పేలుడు సంభవించిన సాహితీ కంపెనీకి సీలు వేసారేగానీ యజమానులను అరెస్ట్ చేయలేదన్నారు. ప్రమాదాలు, భద్రతా ప్రమాణాలపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సాహితీ కంపెనీతో మంత్రికి ఏమైనా ముడుపుల సంబంధం ఉందా ? అని అడిగారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. గాయపడ్డవారిని జీవితాంతం ఆదుకోవాలన్నారు. జగన్ మరోసారి ఢిల్లీకి ప్రధానిని కలవడానికి ఎందుకు వెళ్లారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఆయనమీద ఉన్న కేసులను ఎత్తివేయడానికి వేడుకునేందుకు వెళ్తున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఎపిలో ఇసుక, మద్యం లావాదేవీల్లో యుపిఐ చెల్లింపులను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వీటి నుంచి వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తోందో సమాధానం చెప్పాలన్నారు. మిగతా 2లో..

మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

ప్రైవేటు కళాశాలలపై చర్యలేవీ : ఎస్‌ఎఫ్‌ఐ

వార్త 2లో..

సైన్స్ అవార్డుల రద్దు దారుణం

వార్త 2లో..

అదానీ గంగవరం పోర్టు కార్మికులకు తీవ్ర అన్యాయం

వార్త 4లో..

జివిఎంసి జోన్ 4 కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రభుత్వ భారాలపై సిపిఎం నిరసనలు

పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ వార్త 4లో..

హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 07165 హైదరాబాద్ - కటక్ ప్రత్యేక రైలు జులై 4, 11, 18, 25 తేదీలలో ప్రతి మంగళవారం రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.07 గంటలకు బయలుదేరి సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్ - హైదరాబాద్ ప్రత్యేక రైలు కటక్‌లో జులై 5, 12, 19, 26 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 22.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని, మరలా 07.37 గంటలకు బయలుదేరుతుంది. రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, మిగతా 2లో..

డిజైన్ థింకింగ్‌పై 7, 8 తేదీల్లో జాతీయ సదస్సు

- ఎయుకు కేంద్ర మంత్రి నారాయణ స్వామి రాక
- వివరాలు వెల్లడించిన విసి ప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న విసి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చైర్, ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 7, 8 తేదీలలో డిజైన్ థింకింగ్ - ట్రాన్స్ - డిసిప్లీనరీ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అంశంపై జాతీయ సదస్సును బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఎయు సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. సదస్సును శుక్రవారం ఉదయం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. సదస్సులో ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రముఖ డిజైన్ థింకింగ్ నిపుణులు, ఇఎస్‌ఎస్ సంస్థ వ్యవస్థాపక సంచాలకులు సాయిరాం బొల్లాప్రగడ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 886 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు వెల్లడించారు. సదస్సుకు 1500కుపైగా పరిశోధన పత్రాలు వచ్చాయని, వీటిలో 452 పరిశోధన పత్రాలను ఎంపిక చేసి చర్చిస్తామని అన్నారు. 33 అంశాలపై సదస్సు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కబ్జాలకు రాజకీయ అండ

ఓ అధికార పార్టీ నాయకుడు చుట్టూ కంచె వేసేసినా మధురవాడ జివిఎంసి అధికారులు మిన్నకుండడం విశేషం.

తూతూ మంత్రంగా సర్వేలు

ఇటీవలే విశాఖ గ్రామీణ తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్ఐ, సర్వేయరు ఇతర సిబ్బంది నలుగురు వచ్చి సర్వే నెంబరు 61లో సర్వే చేసి వెనక్కి వెళ్లినా అక్కడ పనులు మాత్రం ఆగడం లేదు. భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనువుగా ఇక్కడ గెడ్డను మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఈ భూమిని అధికార పార్టీ స్థానిక నాయకులే సదరు రియల్ ఎస్టేట్‌దారుకు అమ్మేసినట్లు తెలుస్తోంది. తాజాగా భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌తో సదరు గుత్తేదారు పనులు చేపడుతున్నాడు.

డిజైన్ థింకింగ్‌పై 7, 8 తేదీల్లో జాతీయ సదస్సు

ఉంటుందన్నారు. సమర్పించిన పరిశోధన పత్రాలతో నాలుగు పుస్తకాలు తీసుకువస్తామని అన్నారు. ప్రఖ్యాత స్ప్రింగర్ సంస్థ అత్యుత్తమ పరిశోధన పత్రాలతో ఒక ప్రత్యేక సంచికను తీసుకురానున్నట్లు తెలిపారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం విభిన్న శాస్త్ర అంశాలలో నవ్య పరిశోధనలు జరిపే దిశగా ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌ను నెలకొల్పామన్నారు. ఎయుకు అనుబంధంగా పని చేస్తున్న డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేస్తున్న పరిశోధన మార్గదర్శకం అందించే అర్హత కలిగిన వారిని తీసుకుని దీనిని నిర్వహిస్తున్నామన్నారు. విభిన్న శాస్త్రాలను అనుసంధానం చేసే కేంద్రంగా ఎయు టిడిఆర్ హబ్ నిలుస్తోందన్నారు. సమావేశంలో అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సహ కన్వీనర్లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య బి.మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తాయి. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

డౌనూరులో కాఫీ శుద్ధి కర్మాగారానికి..

రూ.5 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజవర్గం డౌనూరులో కాఫీ శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.5 కోట్లు మంజూరు చేసినట్టు గిరిజన సహకార సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి మీడియాకు తెలిపారు. కాఫీ ప్రాజెక్టు, అంతర్గతంగా కాఫీ తోటల పునరుజ్జీవనం కోసం 2023-24 వార్షిక సంవత్సరానికిగానూ పై నిధులను విడుదల చేసినట్టు వెల్లడించారు. ఈ నిధులను డౌనూరు వద్ద సమగ్ర కాఫీ శుద్ధి కర్మాగారానికి రూ.3 కోట్లు, 2023-24లో ముడి కాఫీ కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయానికి రూ.2 కోట్లు కేటాయించనున్నట్టు వెల్లడించారు. నిధులు కేటాయించిన సిఎంకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

16 రోజుల్లో సినిమా చిత్రీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జెశ్విన్ సినిమాస్ బ్యానరుపై నిర్మించబోయే 'ప్రొడక్షన్ నెంబర్ 2' చిత్రాన్ని 16 రోజుల్లో చిత్రీకరిస్తామని నిర్మాత బెన్నబత్తుల బ్రహ్మాజీ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెశ్విన్ సినిమాస్ పతాకంపై గతంలో తస్మాత్ జాగ్రత్త సినిమా తీశామన్నారు. ప్రస్తుతం రెండో సినిమాకు శ్రీకారం చుటుతున్నామన్నారు. కేవలం 16 రోజుల్లో పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. దర్శకుడు జి.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఈ సినిమాను పూర్తిగా విశాఖలో చిత్రీకరించనున్నామన్నారు. హీరో రతన్‌కాంత్, హీరోయిన్ సుష్మా జెస్విన్, అసిస్టెంట్ డైరెక్టర్లు దుర్గా ప్రసాద్, నాగమణి, నటులు త్రినాథ్, నిహారిక, పాటల రచయిత తుమ్మల శివాజీ, దామోదర్ ఈవెంట్స్ అధినేత దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ముగిసిన ఎన్నికల శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వియంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులకు 'స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024'పై రెండు రోజులపాటు తలపెట్టిన శిక్షన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. రెండో రోజు శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ అక్టోబరు, నవంబరు నెలల్లో ఎస్ఎస్ఆర్ డ్రాఫ్ట్ రిలీజ్ చేయాల్సి ఉంటుందని, జనవరిలో ఫైనల్ ఎస్ఎస్ఆర్ ప్రకటించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల నామినేషన్లకు పది రోజుల ముందు వరకూ ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించవలసి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు.

స్థానిక సమస్యలపై జోనల్ కార్యాలయం ముట్టడి

ధర్నా చేస్తున్న మురికివాడల ప్రజలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మురికివాడలకు తాగునీరు, మౌలిక వసతులు, తదితర సౌకర్యాలు కల్పించాలంటూ జివిఎంసి జోనల్ - 5 కార్యాలయాన్ని పేదలు ముట్టడించారు. అక్కడే వంటా వార్పుకు దిగారు. దీంతో స్పందించిన అధికారులు వారం రోజుల్లో ఇంటింటికీ కుళాయి ఇస్తామని, ఇతర సమస్యలనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 42, 51, 55 వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలంటూ మురికివాడ నివాసుల సంక్షేమం సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో జ్ఞానాపురంలోని జివిఎంసి జోన్ - 5 కార్యాలయాన్ని బుధవారం దిగ్బంధించారు. పోలీసు బలగాలు పెద్ద ఎత్తున రావడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కంచరపాలెం సిఐ సంఘాల నాయకులతో మాట్లాడి జివిఎంసి ఛాంబర్‌ను ఖాళీ చేసి రోడ్డుపైకి వెళ్లాలని కోరారు. దీంతో బయటకు వచ్చిన పేదలు రోడ్డుపై బైఠాయించారు. తుదకు జివిఎంసి జోన్ 5 అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు స్పందించారు. వారం రోజుల్లో 55వ వార్డు ఏకలవ్య కాలనీలో ఇంటింటికీ కుళాయిలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ కాలనీ విషయంపై ఎలాంటి కోర్టు కేసులూ లేవని రాతపూర్వకంగా రాసిచ్చారు. మిగతా కాలనీల సమస్యలను చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మురికివాడ నివాసులు సంక్షేమ సంఘం కన్వీనర్ ఈసర లక్ష్మి, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణి, బాలనాగమ్మ, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, జిల్లా అధ్యక్షులు ఏడుకొండలు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, దళిత విముక్తి కన్వీనర్ ఎస్‌వి.రమణ, ఎమ్ఎన్ఎస్ఎస్ నగర కో - కన్వీనర్లు రూప, ఆసనాల అప్పారావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన..

ప్రైవేటు కళాశాలలపై చర్యలేవీ ? : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నిబంధనలు అతిక్రమించి స్టడీ మెటీరియల్స్, యూనిఫారాలు విక్రయిస్తున్న ప్రైవేటు కళాశాలలపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగర పరిధిలోని ఆశీలుమెట్ట వద్ద ఉన్న నారాయణ ఐఐటి అకాడమీ, నారాయణ జూనియర్ కళాశాల, చైతన్య ఐటి అకాడమీలలో గత నెల 27, 29 తేదీలలో ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు మేరకు ఆర్ఐఒ ఆర్.సత్యనారాయణ దాడులు నిర్వహించి నారాయణ కళాశాలలకు సంబంధించి రెండు లక్షల విలువైన స్టడీ మెటీరియల్, యూనిఫారాలు, చైతన్య కళాశాలకు సంబంధించి సుమారు రెండు లక్షల విలువగల స్టడీ మెటీరియల్‌ను సీజ్ చేశారన్నారు. అనంతరం ఈ ఘటనపై కలెక్టర్‌కు, విద్యాశాఖ కమిషనర్‌కు నివేదిక అందజేసి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. వారం రోజులు గడుస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో దాడులు జరిగిన మరుసటి రోజు నుంచే ఆయా కళాశాలల్లో మరలా విక్రయాలు సాగుతున్నాయని తెలిపారు. నగరంలోని శ్రీచైతన్య నారాయణ, ఫిట్జీ, తిరుమల, శ్రీవిశ్వా, భాష్యం, రవీంద్ర భారతి, పెన్ స్కూల్, విజ్ఞాన్, గాయత్రి, ఆకాష్, పొలక్స్, హరగోపాల్, వాగ్దేవి, బివికె, ఢిల్లీ, విజయం విద్యాసంస్థల యాజ మాన్యాలు యథేచ్ఛగా విక్రయాలు చేపడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలు యూనిఫాం, షూలు, పుస్తకాల విక్రయాలు జరుపుతున్నామన్నారు.

సాయం అందజేస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

పాఠశాలకు

క్రెడాయ్ రూ.1.25 లక్షలు వితరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం క్రెడాయ్ ఆధ్వర్యంలో 11వ వార్డు ఆరిలోవ ఎంపిపి పాఠశాలలో మరమ్మతు పనులకు రూ.లక్షను, రూ.25 వేల విలువైన ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సామగ్రిని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజుకు విరాళంగా అందజేశారు. ఈ వితరణ కార్యక్రమంలో క్రెడాయ్ ఉపాధ్యక్షులు ఇ.అశోక్ కుమార్, సిహెచ్.గోవిందరాజు, కార్యదర్శి వి.శ్రీను, సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస్, జి.కార్తీక్, సివైడబ్ల్యు కో-ఆర్డినేటర్ బివి.శ్రీధర్, కార్యదర్శి పవన్ సంకా పాల్గొన్నారు.

సైన్స్ అవార్డుల రద్దు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శాస్త్ర సాంకేతికను, శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేందుకే కేంద్ర ప్రభుత్వం సైన్స్ అవార్డులను రద్దు చేసిందని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరం 300కి పైగా సైన్స్ అవార్డులను రద్దు చేసిన ప్రభుత్వం, ఈసారి 72 సైన్స్ అవార్డులను నిలిపివేయాలని నిర్ణయించిందన్నారు. శాస్త్రవేత్తల కోసం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన ఈ అవార్డులను రద్దు చేయడం సముచితం కాదన్నారు.

జనరల్ పబ్లిక్ నోటీసు

తేది. 25-06-2023న అడ్వకేట్స్ శ్రీ గౌరీ శంకర్ సారపాటి అండ్ శ్రీ కామేశ్వరరావు రెడ్డి జనరల్ పబ్లిక్ నోటీసుకు నాక్లయింటైన కటారి రమేష్ చంద్రరాజు గారి రిప్లై జనరల్ పబ్లిక్ నోటీసు.

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, సదరు పబ్లిక్ నోటీసు అంశములన్నియు అబద్ధములనియు సదరుషెడ్యూల్ ఆస్థి నాక్లయింటు అయిన కటారి రమేష్ చంద్ర రాజు గారికి వారి తండ్రి గారి ద్వారా రిజిష్టర్ డాక్యుమెంట్ ద్వారా దఖలుపడి ఆయన ఎక్కచ్చి హక్కు అనుభవములలో కలదని, సదరు విషయం వారి అక్కాచెల్లెళ్లు అయిన కటారి అనురాధ మరియు శ్రీదేవి గార్లకు కూడా తెలియునని నా క్లయింటుకు వారికి నచ్చిన విధంగా ఆషెడ్యూల్ ఆస్తిని అనుభవించే హక్కుగలదని వారి చెల్లెళ్లు పైవిధంగా నోటీసు ఇవ్వడం ఆశ్చర్యం అనిపించిందనియు, ఇది వేరే వారి ప్రోద్భలం మీద జరిగి ఉండవచ్చునని అనిపించుచున్నదనియు కావున ఎవరికీ నాక్లయింటు ఎటువంటి లావా దేవీలు జరిపిన, సదరు ఆస్థిపై అడ్డుపెట్టే హక్కు లేదనియు అట్టి అభ్యంతరములేవియు చెల్లనేర వనియు, కావున ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా నిరభ్యంతరంగా నా క్లయింటుతో సదరు ఆస్తికి సంబంధించి లావాదేవీలు జరపవచ్చును.

షెడ్యూలు ఆస్థి వివరములు: SRO విశాఖపట్నం జివియంసి ఏరియాలో చేరినటువంటి, వాల్తేరు వార్డు బ్లాక్ నెం.23, T/s No. 379,ఈస్టుపాయింట్ కాలనీ దాఖలా ప్లాట్ నెం. 6లో 400 చ॥గ॥ విస్తీర్ణం గల స్థలమున్నూ అందలి డో.నెం. 6-18-4గా కలిగిన ఆర్.సి.సి. డాబా ఇల్లు సహిత ఆస్తికి హద్దులు. **తూర్పు:** ప్లాట్ నెం.7రు గల పి. రామకృష్ణ గారి ఇల్లు, **దక్షిణం:** ప్లాట్ నెం. 18, **పడమర:** ప్లాట్ నెం.5రు గల యం.పి. రాజు గారి ఇల్లు, **ఉత్తరం:** 40అ॥ల వెడల్పుగల రోడ్డు.

Smt. K. PRABHAVATHI, Adocate
G-6, A-Block, Ramalakshmi Estates, Peda Waltair
Visakhapatnam - 530 017. **Cell: 94404 35309**

IN THE HONOURABLE COURT OF THE III ADDL.JUNIOR CIVIL JUDGE CUM PROHIBITION AND EXCISE AT SRIKAKULAM.
IA 123/2021 0.S.No.328/2021

Between:-
Koribilli Umamaheswari & another
...Petitioners/Plaintiffs.
And:-
1.Duvvada Omnamasivaya & 2 others
...Respondents/Defendants
To,
R-1. Duvvada Omanama Sivaya son of late Sarveswararao,aged 63 years, retired employee, door no 20-5-11, Gavarapalem, Anakapalli,Visakhapatnam district. Flot No. 303, Shivaji Towers, Rajanagar colony, Anakapalli.

Please take notice that the above **I.A 123/2021** and also **O.S 308/2021** is posted to **31/07/2023** for your appearance in the above said court. you are (Respondent No.1) informed to appear on the said date at **10:30 AM.,** above saide court in person or through advocate and if you fail to appear the Aforesaid matter will be decided Exparte on merits.

M.H.G.L.N. RAJU
ADVOCATE,
SRIKAKULAM.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
PUBLIC NOITCE
E-FILE No. 345359, Date : 04-07-2023

The Commissioner, Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam has approved Road Development plan showing the proposed 60'-0" MP Road from Kommadi 100'-0" Road @ Sy.No. 90 to 100'-0" wide Road @ S.No. 149 (Forest Boundary) in Ward-6 Kommadi Village in Sy.No. 67P, 68P, 69P, 72P, 88P, 89P, 90P, 91P, 149P of Kommadi Village as per G.O.Ms.No. 180 MA & UD, Dt. 01-10-2020.

Hence, the general public are here by informed to submit their objections / suggestions if any, in this regard within 15 days from the date of publication of this notification to Zonal Officer, Zone-II, Madhurawada, GVMC pertaining to the above approval of 60'-0" MP Road from Kommadi 100'-0" Road @ Sy.No. 90 to 100'-0" wide Road @ S.No. 149 (Forest Boundary) in Ward-6 Kommadi Village failing which it will be considered that there are no objections/suggestions etc., and the above approval of Road Development Plan (RDP) will be processed as per Rules.

Sd/- COMMISSIONER, GVMC, Visakhapatnam.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
O.S. 149 / 2022
Between:
Smt. Sukasi Lakshmi
... Plaintiff
And:
01. Pothina Sanni Babu
02. M/s. Ganesh Township Pvt Ltd. Rep. by its Director Edupuganti Radhika
.... Defendants
To:
D-2: M/s. Ganesh Township Pvt Ltd. Rep. by its Director Edupuganti Radhika, W/o. Late Kameswara Rao, Hindu, aged 51 years, Office Situated at Flat No. 102, Sri Kasimnaidu residency, Akkayyapalem, Visakhapatnam.

Whereas the above named plaintiff filed a suit against you and 1st defendant for permanent injuction and amongst other reliefs and you are hereby directed to appear before the above mentioned court on 10-08-2023 by 10-30 A.M. Failing which the matter will be heard and decided ex-parte against you.

(By Order of the Court)
Sri P.VENKATESWARA RAO
Sri B.A.RAJU
Sri A.SHARAD KUMAR
Advocates,
Bheemunipatnam.
Cell : 98496 95844

కాలువలపై ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి కథనానికి స్పందించిన జోనల్ కమిషనర్

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలోని జిసిసి లే-అవుట్‌లో మురుగు, వర్షపు నీరు పోయే మార్గం లేకుండా డ్రెయినేజీ కాలువలపై ఉన్న ఆక్రమణలను వారం రోజుల్లోగా తొలగించాలని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ఆదేశించారు. 'కాలువల ఆక్రమణలతో మురుగు కష్టాలు' అనే శీర్షికన బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. బుధవారం ఉదయం జిసిసి లే-అవుట్‌లో ఆక్రమణకు గురైన కాలువ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ తలెత్తుతున్న సమస్యను గుర్తించి కాలువ మీద ఉన్న ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ముందుగా కాలువ మీద ఉన్న దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్ శాఖ ఇఇని కోరారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ మీటర్లు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు వైసిపి అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు పాల్గొన్నారు.

కాలువలపై ఉన్న కబ్జాలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-సీతమ్మధార : మాడుగుల నుంచి గంజాయిని తెచ్చి రైల్వే న్యూ కాలనీ ప్రాంతంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నిందితులను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విశాఖ నగర పరిధి రవీంద్రనగర్‌కు చెందిన అలంకరిపాలు రాజు, జికె.వీధికి చెందిన గిర్ల సురేంద్ర, అల్లూరి జిల్లాకు చెందిన పోతరంగి చిన్నంనాయుడు, జి.మాడుగులకు చెందిన కోళ్లపాటి శ్రీనుబాబు, కంచరపాలెం ప్రాంతానికి చెందిన తిరువాడ చలపతిని అరెస్టుచేశారు. పట్టుబడిన శ్రీనుబాబుపై జి.మాడుగుల పోలీస్ స్టేషన్లో నకిలీ మావోయిస్టు కేసు నమోదై ఉందని, అప్పటి నుంచి ఆయన పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విచారణ నిమిత్తం వీరిని నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. నాలుగో పట్టణ సిఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలువైన పత్రాలు, నగదు అందజేత

ప్రజాశక్తి-సీతమ్మధార : లలితానగర్‌లో ఉంటున్న వెంకటలక్ష్మి ఇంటిలోకి మతిస్థిమితం లేని వ్యక్తి చొరబడి విలువైన కాగితాలు, రూ.35 వేలు నగదు తీసుకొని రోడ్డు మీద విసిరేశాడు. ఆ ప్రాంతానికి చెందిన వంశీ దీన్ని గమనించి వాటిని సేకరించి నాలుగో పట్టణ ఎస్సై కాగేశ్వరరావుకు అందజేశారు. ఆ ప్రతాల్లో ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి వారిని స్టేషన్‌కు పిలిపించారు. విలువైన పత్రాలను, నగదును వెంకటలక్ష్మికి ఎస్ఐ కాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా నిజాయతీగా వ్యవహరించిన వంశీని అభినందించారు.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-పెందుర్తి : భార్య కనిపించలేదని పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఆమె భర్త ఫిర్యాదుచేశారు. పూజారి మోసే తన భార్య అపర్ణలో కలిసి పెందుర్తి ప్రాంతంలో నివాసముంటున్నారు. ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన అపర్ణ తిరిగి ఇంటికి రాలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువు అవినాష్‌కి ఫోన్ చేసే ఆమె హైదరాబాద్ వెళ్లినట్లు చెప్పారని వివరించారు. ఆమెకు రాజకీయాలంటే ఇష్టమని, ఆమె సొంతూరు రాజవొమ్మంగిలో కూడా రాజకీయంలో ఉండేవారని తెలిపారు. ఎఎస్ఐ కెఎస్‌కె.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ తెలిపారు. భీమిలి పరిధిలోని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భీమిలితో పాటు డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పశు వైద్యశాలల్లో కూడా టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. కుక్కల ద్వారా మనుషులకు సోకే ర్యాబిస్ వ్యాధి నివారణకు ఈ టీకాలు వేయించాలని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం లైన్ నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేములవలస తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విప్లవ జ్యోతి అల్లూరి జ్ఞాపకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : "విప్లవ జ్యోతి అల్లూరి జ్ఞాపకాలు" పేరిట సీతారామరాజు జీవిత విశేషాలు, వెలుగులోకి రాని పలు అంశాలను క్రోడీకరిస్తూ భీమిలికి చెందిన ప్రముఖ రచయిత పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ రాసిన వ్యాస సంకలనాన్ని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుచే మంగళవారం విజయవాడలో ఆవిష్కరించారు. రచయితను అభినందిస్తూ చంద్రబాబు జ్ఞాపిక అందజేశారు.

వైభవంగా ఉంజల్ సేవ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో బుధవారం అత్యంత వైభవంగా అర్చకులు ఉంజల్ సేవను నిర్వహించారు. ముందుగా షోడశోపచార పూజలు నిర్వహించి స్వామివారితో పాటు ఉభయ దేవేరులను ప్రత్యేకంగా అలంకరించిన శేషతైన వాహనంపై ఉంచి ఉంజల్ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాసచార్యులు అర్చకులు సీతారామచార్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీదేవిలతోపాటు నాయికోడాస్ పాల్గొన్నారు.

శ్రీనుబాబుకు పరామర్శ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు తండ్రి గంట్ల తాతారావు ఇటీవల మృతి చెందడంతో దేవస్థానం ఈఓ వి.త్రినాథరావు బుధవారం శ్రీనుబాబు కుటుంబాన్ని పరామర్శించారు. తాతారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

హాస్టల్ మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ బిసి కళాశాల బాలికల వసతి గృహం మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. మండలంలోని చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ.35 లక్షలతో చేపట్టనున్న మరమ్మతు పనులను ఆయన పర్యవేక్షించారు. మరమ్మతులకు గురైన మిగిలిన ప్రభుత్వ వసతి గృహాల్లో కూడా మరమ్మతు పనులు చేపట్టాలని దివీస్ యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం వసతి గృహం ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు.

డిగ్రీ తొలి సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ

విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ నరసింగరావు

ప్రజాశక్తి- తగరపువలస : ఆంధ్రయూనివర్సిటీ ఈ నెల 4వ తేదీన విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థినిలు ప్రతిభ కనబర్చినట్లు స్థానిక శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల డైరెక్టర్ బి.నరసింగరావు తెలిపారు. బిఎస్‌సి మొదటి ఏడాది చదువుతున్న డి.దీపిక 10 పాయింట్లకు 9.28, కుందన ఆదిశ్రీ, ఎస్ తేజస్విని 8.68 పాయింట్లు సాధించారని పేర్కొన్నారు. 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ నరసింగరావు, ప్రిన్సిపల్ సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.చిట్టిరెడ్డి, అధ్యాపకులు కళాశాలలో బుధవారం అభినందించారు.

డైట్ ప్రిన్సిపల్‌గా సుధాకర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్‌గా ఎల్.సుధాకర్ బుధవారం పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు సుధాకర్ వైస్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేసిన యు.మాణిక్యంనాయుడు విజయనగరం డైట్‌కు బదిలీపై వెళ్ళారు. అక్కడ గణితం అధ్యాపకునిగా విధులు నిర్వర్తించనున్నారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌కు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

డైట్ ప్రిన్సిపల్ సుధాకర్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

సొండి కులాన్ని ఒబిసిలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : సొండి కులాన్ని ఒబిసి జాబితాలో చేర్చాలని సిఎస్ జవహర్‌రెడ్డికి ఏపీ సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కాశీవిశ్వనాథన్‌చౌదరి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సొండి కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, సరుబుజ్జిలి, మోగిలిపురి వెంకటరమణయ్య, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన

టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం ఎన్ఎడ్ఆర్.కాలనీలోని టిడ్కో ఇళ్లను కార్పొరేటర్ కంపా హనుక్‌తో కలిసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో 280 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, చుట్టూ సిసి రోడ్లు, తాగునీటి పైపులైన్ల పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. 15 రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని టిడ్కో హౌసింగ్ కార్య నిర్వాహక ఇంజినీరును ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఇల్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడును ఆదేశించారు. పరిసరాలలో గ్రీనరీ, విద్యుత్ దీపాలు ఏర్పాట్లు, భూగర్భ డ్రెయినేజీ తదితరాలను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఎపిడి పద్మావతి, టిడ్కో హౌసింగ్ కార్య నిర్వాహక ఇంజినీర్, సహాయక ఇంజినీరు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి హైస్కూల్ నుంచి బదిలీ అయిన ఆరుగురు, ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ముగ్గురు, బర్లపేట, సుంకరపేట నుంచి బదిలీ అయిన ఒక్కొక్క ఉపాధ్యాయునికి బుధవారం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ, బాగా పనిచేసిన వారిని గౌరవించి సన్మానించడం అవసరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమములో జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు, ఉపాధ్యాయులు యర్రయ్య, రామునాయుడు, శ్రీను, కుమార్, జగదీష్, బి.సన్యాసినాయుడు, ఎం.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి- తగరపువలస : క్షేత్ర స్థాయిలో టిడిపి బలోపేతానికి మరింతగా కృషిచేయాలని పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు కోరారు. జివిఎంసి ఒకటో వార్డు పార్టీ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజబాబు హాజరై మాట్లాడారు. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని సమన్వయ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్లా సురేష్, వార్డు అధ్యక్షులు టి.సూరిబాబు, వానపల్లి సత్య, చిలకా నరసింగరావు, ఎంవి.గురుమూర్తి, నరవ రామారావు, తాటిపూడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

సంఘీభావ నిధిని సేకరిస్తున్న సిఐటియు నాయకులు

పోలవరం పోరాటానికి సంఘీభావ నిధి సేకరణ

ప్రజాశక్తి -గాజువాక : పోలవరం నిర్వాసితుల సమస్యలపై చేస్తున్న పోరాటానికి భెల్ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం సంస్థ మెయిన్ గేటు వద్ద సంఘీభావ నిధి సేకరించారు. మొత్తం మూడు షిఫ్టుల్లోనూ విరాళాలు సేకరించగా మొత్తం రూ.8,113 వచ్చినట్లు సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్, కె.విజయకుమార్, ఎస్.జగన్నాధరావు, కె.నారపరెడ్డి, ఎస్.అప్పారావు, పి.కనకారావు, జి.అచ్చంనాయుడు, పి.శివరాం, ఎం.నర్సింగరావు తెలిపారు.

7న జాబ్ మేళా

ప్రజాశక్తి -గాజువాక : ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో గాజువాకలోని గవర్నమెంట్ ఐటిఐలో ఈ నెల 7వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 9 గంటలకు 11 ప్రముఖ కంపెనీలు సుమారు 500 ఖాళీల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. అదే రోజున స్పాట్ రిజిస్ట్రేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో డబ్ల్యూఎన్ఎస్, బి డేటా టెక్నాలజీ, సెయింట్ గోబియన్, యోకోహమా, హోటెల్ బేలోస్, డెక్కన్ ఫైన్ కెమికల్, వెబ్ ప్రో సొల్యూషన్, ఎయిర్‌టెల్ బ్రాడ్ బ్రాండ్, నవత ట్రాన్స్‌పోర్ట్, జయభేరి ఆటోమోటివ్స్, సినర్జీస్ కాస్టింగ్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఈ అవకాశాన్ని గాజువాక నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్హులైన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని, టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతల ఆధారంగా రూ.10 వేలు నుంచి రూ.30 వేలు వరకు జీతం ఉంటుందని తెలిపారు. విశాఖపట్నం, దువ్వాడ, తుని, నక్కపల్లి, హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్నవారంతా హాజరు కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9014772885, 9848438254 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, 76వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దొడ్డి రమణ, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు రోహిణి, సాయికృష్ణ చైతన్య, ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పివి సురేష్‌కు పరామర్శ

ప్రజాశక్తి- ములగాడ : ఇటీవల మాతృవియోగం పొందిన పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు, జివిఎంసి 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ కుటుంబాన్ని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ తండ్రి పిండి సత్యన్నారాయణ సహా కుటుంబసభ్యులకు లక్ష్మీనారాయణ ధైర్యం చెప్పారు.

హైస్కూల్ అదనపు భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి మధురనగర్ హైస్కూల్‌లో రూ.36లక్షల వ్యయంతో చేపట్టే అదనపు భవనం (2వ అంతస్తు) నిర్మాణానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యాన జరిగిన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిల్లలు చదువుకోడానికి అన్ని సౌకర్యాలూ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, 14వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఎపిడి దుర్గాప్రసాద్, ఎఇ గుప్తా, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దేముడుబాబు, 25వ వార్డు నాయకులు భోగవల్లి గోవింద్, సమ్మెట్ల వెంకటేష్, హరికృష్ణ, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అదనపు భవనానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్

ప్రభుత్వ భారాలపై సిపిఎం నిరసనలు

పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్

చెత్తపై యూజర్ ఛార్జీలు దారుణమన్న నేతలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన విశాఖ నగరంలో బుధవారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను, చెత్తపై యూజర్ ఛార్జీలను రద్దు చేయాలని పెద్దపెట్టున నినదించారు. వార్డు సచివాలయాలు, నివాస ప్రాంతాల్లో జరిగిన ఈ నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎంవిపి.కాలనీ : జివిఎంసి 22వ వార్డు పిఠాపురం కాలనీ సచివాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడారు. ట్రూఅప్, ఫిక్సిడ్, కస్టమర్ ఛార్జీల పేరిట ప్రజలను బాధించడం సరికాదన్నారు. నాయకులు జివిఎన్.చలపతి, జి.రమణ, ప్రదీప్, కుమార్ మంగళం, అనపర్తి అప్పారావు, కె.కుమారి, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : చెత్తపై యూజర్ ఛార్జీలతో ప్రభుత్వ పథకాలను లింకు పెట్టడం తగదని సిపిఎం సీనియర్ నాయకులు వై రాజు, జి.అప్పలరాజు అన్నారు. బుధవారం వెంకటేశ్వర థియేటర్ వద్దగల జివిఎంసి జోన్ 4 కార్యాలయం వద్ద సిపిఎం జగదాంబ జోన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.నరసింగరావు, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కంచరపాలెం : జివిఎంసి 56వ వార్డు పరిధి మల్లసూరివీధి, 54వ వార్డు పరిధి రవీంద్రనగర్ సచివాలయాల వద్ద సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, ఎన్.మోహన్, డి.పైడిరాజు, ఎమ్.సంతోషి, ఎస్.అప్పలరాజు, పార్వతి, సూరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి రవీంద్రనగర్ బస్‌స్టాప్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పాలన అంటూనే ప్రజలపై తీవ్ర భారాలు వేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కమిటీ సభ్యులు డి.నాగరాజు, పి.శంకరరావు, బి.గౌరి, జి.నాగరాజు, రమణ, తవిటినాయుడు, సూర్యనారాయణ తదితులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెంలోని సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి రాజు, నాయకులు గొరేష్, లక్ష్మీపతి, జ్యోతి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీ, 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, 59వ వార్డు పరిధి నెహ్రూనగర్, 62వ వార్డు పరిధి త్రినాధపురం, దుర్గానగర్, ఎఎస్ఆర్ కాలనీ, 63వ వార్డు పరిధి చింతల్లోవ సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, జె.రామునాయుడు, ఆర్.విమల, బి.మమత, నిర్మల, కృష్ణవేణి, కె.నూకరాజు, బి.తాతాజీ, పి.రామారావు, బి.జగ్గునాయుడు, పి.వరలక్ష్మి, గురులక్ష్మీగణేష్, ఎ.చాయ, లక్ష్మీకాంతం, కె.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీ, దుర్గానగర్, త్రినాధపురంలో సిపిఐ ఆధ్వర్యాన ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. చెత్తపన్ను, పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దుచేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుడాల రాంబాబు, బద్దం సత్యానందరావు, గండి అప్పారావు, కె.శ్రీనివాస్, త్రినాథ్, బి.గోపాలరావు, నూనెల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి పరిధి గాంధీనగర్, దిబ్బపాలెం, దశమికొండ, చట్టివానిపాలెం, శ్రీనగర్, శ్రీరామ్‌నగర్, సుందరయ్యకాలనీ, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, అప్పన్నకాలనీ సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎ.లోకేష్, వై.లక్ష్మణ్, ఎం.విజయరావు, పి.నర్సింగరావు, బి.అప్పారావు, జెసి.లక్ష్మి, ఎం.శ్రీదేవి, జి.లక్ష్మి, కెవి.రమణ, రాజు, పావని, ప్రసాద్, సత్యనారాయణ, డి.శ్రీనివాస్, లోకేష్, డి.రమణ, భాగ్యేశ్వరరావు, ఐద్వా నాయకులు కె.వేణు, తాయారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సప్తగిరినగర్ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ మాట్లాడుతూ, అడగకుండా సంక్షేమ పథకాలు ఇచ్చి, ఆ భారాలను ప్రజలపై వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చెత్త పన్ను, విద్యుత్ ఛార్జీల పెంపు తదితర భారాలు వేసిన జగన్మోహన్‌రెడ్డి పునరాలోచించకపోతే, రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు, శంకరరావు, ఐద్వా నాయకులు రజని తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

మల్కాపురం ప్రాంతంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన...

గాజువాకలో...

పెందుర్తి పరిధి సప్తగిరినగర్‌లో...

అదానీ గంగవరం పోర్టు కార్మికులకు తీవ్ర అన్యాయం : కెఎం

ప్రజాశక్తి- గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికులకు యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు తెలిపారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండివైఖరికి నిరసనగా కార్మికులు చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, గంగవరం పోర్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ యాజమాన్యం దోచుకుంటోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గంగవరం పోర్టు అంతర్జాతీయంగా వ్యాపారలావాదేవీలు జరుపుతూ రూ.కోట్లలో లాభాలను గడిస్తున్నా కార్మికులకు మాత్రం గంగవరం పోర్టు స్టాఫ్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రకారం వేతనాలు చెల్లించడం దుర్మార్గం అన్నారు. వేతనాలు పెంచాలని కోరిన కార్మికులపై కక్ష సాధింపులకు పాల్పడుతూ ఉద్యోగాలు తొలగిస్తోందన్నారు. వేతనాల పెంచాలని నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసిత కార్మికులపై ఆంక్షలు పెట్టి బెదిరిస్తోందన్నారు. గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సమస్యను జటిలం చేస్తోందన్నారు. నిర్వాసిత కార్మికులకు కనీస జీతం రూ.36 వేలు ఇవ్వాలని, బేసిక్‌లో డిఎ మెర్జ్ చేసి కొత్త బేసిక్ రూ.22 వేలుగా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేవరకూ ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి అన్నపూర్ణ, భారత్ బచావో జిల్లా కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, ట్రెజరర్ వాసుపిల్లి ఎల్లాజీ, ఉమ్మడి అప్పారావు, గంటపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, కదిరి సత్యానందం పేర్ల నూకరాజు, నొల్లు స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కెఎం.శ్రీనివాసరావు

ఎన్‌టిపిసిలో డెస్ట్ అలవెన్స్ పెంచాలని ధర్నా

ప్రజాశక్తి - పరవాడ

సింహాద్రి ఎన్టీపీసీలో కాంటాక్ట్ కార్మికులకు డెస్ట్ అలవెన్స్ పెంచుతూ వెంటనే అగ్రిమెంట్ చేయాలని కోరుతూ ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌టిపిసి సింహాద్రి మెయిన్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌టిపిసిలో డెస్ట్ అలవాన్స్ సమస్య సంవత్సరాలు తరబడి పెండింగ్లో పెట్టడం దుర్మార్గమన్నారు. మెడికల్ టెస్టు పేరుతో వేధింపులు గురి చేయడం డ్యూటీ నుండి నిలిపివేయడం అన్యాయమన్నారు. కాంటాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్ పూర్తి అయిన తేదీ నుండి ఏరియర్స్ చెల్లించాలని కోరారు. ఎన్టిపిసి యాజమాన్యం విభజించు, పాలించు, విధానాన్ని అమలు చేస్తుందని అన్ని యూనియన్లతో చర్చలు చేసి సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి పి నాయుడు, ఉపాధ్యక్షులు పి గోవిందరాజు, ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, సిఐటియు నేత గనిశెట్టి

గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

సచివాలయ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మునగపాక బైపాస్ రోడ్డు సమీపంలో నూతనంగా రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం-1 సచివాలయం- 2 భవనాలను ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం గొల్లల పాలెం గ్రామానికి చెందిన 8 మంది తెలుగుదేశం కార్యకర్తలను కండువాలు వేసి పార్టీలోనికి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మల్ల జయలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మండల మహిళా కన్వీనర్ చీర రమణమ్మ, పొలిమేర గణేష్, కాండ్రేగుల నూకరాజు పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు ,వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు అందజేస్తున్న లంకవానిపాలెం సర్పంచ్ దొరబాబు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించిస్తున్నట్లు మండలంలోని లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు అన్నారు. ఆ గ్రామంలో బుధవారం నూతనంగా మంజూరైన 11 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందనివారు ఉంటే తనను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో

సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్

15న ముగింపు పోటీలకు సినీ నటుడు సుమన్ రాక

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈ నెల 14, 15 తేదీల్లో సౌత్ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్, డిఆర్‌కె కప్ పోటీలను స్థానిక వివి.రమణ రైతు భారతిలో నిర్వహిస్తామని వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన మెమోంటోను, పోస్టర్లను బుధవారం వీవీ.రమణ రైతుభారతిలో రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో గతేడాది దక్షిణభారత స్థాయిలో కరాటే పోటీలను నిర్వహించామని, ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్ఎస్ఎస్‌కేఏఐ ప్రెసిడెంట్, చీఫ్ ఇనస్ట్రక్టర్ ఎస్‌పిఎండి నాయుడు మాట్లాడుతూ ఈ పోటీలకు ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి 400మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. తాము నిర్వహించే పోటీలకు రత్నాకర్ సహకారం ఎల్లవేళలా ఉండడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 80, 81 వార్డుల వైసిపి ఇన్‌ఛార్జులు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, వ్యవసాయదారుల సంఘం నేత భీశెట్టి కృష్ణప్పారావు, విల్లూరి రాము, రేబాక ఇంద్రకుమార్, ఎన్ఎస్ఎస్‌కేఏఐ స్టేట్ ప్రెసిడెంట్ హేమంత్, కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్, మెమోంటోను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్ తదితరులు

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి-వడ్డాది : గడప గడప నిధులతో గ్రామాలలో మౌలిక సదుపాయాలు పెంపొందిస్తున్నామని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం ఉదయం వడ్డాది-1 సచివాలయంలో ఎమ్మెల్యే ఇంటింటి పర్యటన చేశారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశించారు. జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచు కోరుకొండ కామలక్ష్మి, ఉప సర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, వైసీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

'సాహితీ ఫార్మా' మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని సాహితీ ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర పరిశ్రమల మంత్రిశాఖ గుడివాడ అమర్నాథ్ ప్రకటించిన రూ.25 లక్షలు తక్షణమే అందించాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదం జరిగి ఆరు రోజులైనా ఆ ప్రమాదం ఎలా జరిగిందో అధికారులు నేటికీ ప్రకటించక పోవడం దారుణమన్నారు. యాజమాన్యాన్ని రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వేసిన కమిటీ నేటికీ విచారణ ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్, స్థానిక ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు తూతూ మంత్రంగా సానుభూతి తెలియజేశారు తప్ప చనిపోయిన కుటుంబాలకు ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మంత్రి ప్రకటించిన రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బోడి వెంకటరావు, విల్లూరు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం వెంటనే ప్రారంభించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

ప్రజాశక్తి అచ్యుతాపురం

అచ్చుతాపురంలో ఈఎస్ఐ 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో బుధవారం ఆయన ఈఎస్ఐ హాస్పిటల్ గురించి మాట్లాడారు. అచ్చుతాపురం సెజ్, ఫార్మా, ఎన్ఏఓబి, పరవాడ ఫార్మాలో వేలాది మంది కార్మికులు, యజమాన్యాల నుండి ఈఎస్ఐ పేరుతో సంవత్సరానికి సుమారు రూ.50 కోట్లు ఈఎస్ఐ కార్పొరేషన్ వసూలు చేస్తుందని తెలిపారు. అయినా ఈఎస్ఐ నుండి వైద్య సేవలు అందడం లేదన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్ల నుండి పోరాడుతున్న నేటికీ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోలేదన్నారు. స్థలం, డబ్బులు కేటాయించామని ప్రమాదాలు జరిగినప్పుడు చెబుతూ తర్వాత వదిలేస్తున్నారని విమర్శించారు. వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టి కార్మిక ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సత్తిబాబు, రుతల గోవిందా, ముత్యాకర్ల రమణ తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

మంత్రుల వైఫల్యం వల్లే అందని పంటల బీమా

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు వైఫల్యం వల్లే రైతులకు పంటల బీమా అందలేదని, వైసిపి ప్రభుత్వం పంటల ఉచిత బీమా పేరుతో రైతులను మరోసారి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత ఏడాది భారీ వర్షాలకు అనకాపల్లి నియోజకవర్గంలో 600ఎకరాలలో పంట దెబ్బతిందని, ఏ ఒక్క రైతుకూ పంట బీమా పరిహారం అందలేదని తెలిపారు. తక్షణమే ఆ రైతులకు బీమా పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు విన్నవించామన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలకు వైసిపి విధానాలే కారణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్ర, ధనాల విష్ణు చౌదరి, సూరే సతీష్, కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), తలారి లక్ష్మి ప్రసాద్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్' లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైద్య ఆరోగ్య సిబ్బంది ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా తమకు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్ ఆదేశించారు. మండలంలోని పిసినికాడ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఫ్యామిలీ ఫిజిషన్ కాన్సెప్ట్‌లో భాగంగా షుగర్, బీపీ కేసులను పర్యవేక్షించారు. టార్గెట్లన్నీ రీచ్ అవ్వాలని కోరారు. చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాలను పరీక్షించారు. చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కసింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ తిరుపతిరావు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్

కొక్కిరాపల్లి పిఎసిఎస్‌ను ఆదుకుంటాం

ప్రజాశక్తి - యలమంచిలి : ఆర్థిక లావాదేవీలు నిర్వహించడంలో కష్టాలు ఎదుర్కొంటున్న యలమంచిలి కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని కేంద్ర జిల్లా సమావేశంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకొంటామని జిల్లా కేంద్ర సహకార సంఘం సిఇఒ డివిఎస్ వర్మ బుధవారం హామీ ఇచ్చారు. యలమంచిలి డిసిసిబి బ్రాంచి కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన గతంలో జిల్లా సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఆయన కొక్కిరాపల్లి పిఎసిఎస్ సందర్శించి హామీ ఇవ్వడం ఆనందంగా ఉందని చైర్మన్ మళ్ల కొండబాబు అన్నారు. అనంతరం ఆయన్ని కొండబాబు సత్కరించారు. కార్యక్రమంలో డిసిసిబి డిజిఎం ఎం.అశోక్‌కుమార్, ఎజిఎం శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ కిషోర్, బ్రాంచి మేనేజర్ లావణ్య,డెరెక్టర్లు పందిరి రాంబాబు, యర్రంశెట్టి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి సిఇఒ వర్మను సత్కరిస్తున్న కొక్కిరాపల్లి పిఎసిఎస్ ప్రతినిధులు

ఉద్యోగాల్లో క్రీడా కోటా రద్దు ప్రతిపాదన విరమించాలి

డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శివాజీ, రాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగాల భర్తీలో ఇప్పటివరకు అమలు చేస్తున్న క్రీడల కోటాను రాష్ట్ర ప్రభుత్వం రద్దు ప్రతిపాదనను విరమించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సిహెచ్.శివాజీ, అల్లు రాజులు డిమాండ్ చేశారు. స్థానిక కార్మికకర్షక భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దీనివల్ల ఎంతోమంది క్రీడాకారులు పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా, అధికారులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆ విధానాన్ని రద్దు చేసే ఆలోచనలో చేయడం తగదన్నారు. ఇప్పటివరకు మెడల్స్ సాధించిన వారికి ఎక్కువగా పోలీస్, రెవెన్యూ శాఖలతోపాటు కేంద్ర ప్రభుత్వ సర్వీసెస్, రైల్వే, పోర్టులు వంటి వాటిల్లో ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. ఇకపై వారికి ఉద్యోగాల విధానానికి స్వస్తి పలికితే రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఆసక్తి చూపరని పేర్కొన్నారు. మెడల్స్ సాధించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం మాత్రమే అందించాలనే నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం రావడమంటే క్రీడా కారులకు ద్రోహం చేయడమే అవుతుందన్నారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గంటా సురేష్, పాంగి చలపతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎ.రాజు

మొక్కలు నాటుతున్న గృహ నిర్మాణశాఖ అధికారి రమామణి

జగనన్న లేఅవుట్‌లో మొక్కల నాటివేత

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట దాడివారి వీధి, జగనన్న లేఅవుట్లో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి కొయ్య రమామణి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సహాయక మేనేజర్లు చింతాడ కిరణ్ బాబు, కె.గౌతమ్, డిఈఈ పి.ప్రసాద్, జేసీపీ నాయకులు శేఖర్, ఎస్‌విఎస్‌ఎస్ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు జి.నూకరాజు, వెలగ శ్రీనివాసరావు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్టు బోర్డుల నియామకంలో జాప్యం తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలోని వివిధ దేవాలయాలకు ట్రస్టుబోర్డు సభ్యుల ఎంపిక పూర్తైనా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ప్రకటించకుండా ఉద్దేశపూర్వకంగా తీవ్ర జాప్యం చేస్తున్నారని సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ట్రస్టు బోర్డులను నియమించగా, గడచిన పదేళ్లుగా అనకాపల్లిలోని దేవాలయాలకు మాత్రమే ట్రస్టు బోర్డులను నియమించకపోవడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో మాజీ, తాజా ఎమ్మెల్యేలు విఫలమయ్యారన్నారు. భక్తుల నుంచి హుండీ ద్వారా విరాళాలు, ముడుపులు, మొక్కుబడులు స్వీకరించడంలో చూపిస్తున్న శ్రద్ధ ట్రస్టు బోర్డు నియామకాల్లో చూపకపోవడం సిగ్గుచేటన్నారు. ఫలితంగా ఆలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని, పర్యవేక్షణ కొరవడిరదని, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని దుయ్యబట్టారు.

సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులుగా అప్పారావు, లక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్న అనకాపల్లి జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీలో స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కాండ్రేగుల అప్పారావు, శరగడం లక్ష్మి సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని బుధవారం రైతు భారతి సమావేశ మందిరంలో జరిగిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో సత్కరించారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, బీసెట్టి కృష్ణ అప్పారావు, విల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం జంక్షన్‌లో బుధవారం వాహనాలు తనిఖీ చేయుచుండగా రాజాం గ్రామానికి చెందిన చట్టా సతీష్ అనే వ్యక్తి ఏ అనుమతులు లేకుండా వెదుర్ల గెడ్డ నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా అతని వద్ద నుండి ఇసుకతో ఉన్న ట్రాక్టర్ సీజ్ చేశారు. దానిని స్టేషన్‌కు తరలించి రూ.13వేలు జరిమానా విధించినట్లే బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి తెలిపారు.

గాయపడిన పాత్రికేయునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయ పడిన సీనియర్ విలేకరి చోడవరం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్‌ను స్థానిక పాత్రికేయులు పరామర్శించారు. విశాఖలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సతీష్‌ను పాత్రికేయులు కలుసుకుని వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కుబిరెడ్డి రాధాకృష్ణ, బాలగంగాధర్, వెంకటరావు, ధర్మారావు, సన్నిబాబు, సత్యనారాయణ, రామకృష్ణ, నంబరు అప్పారావు పాల్గొన్నారు.

తోటి విలేకరికి ఆర్థిక సాయం అందిస్తున్న పాత్రికేయులు

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను రక్షించాలి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని రావాడ రెవిన్యూలోని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను రక్షించాలని రావాడ పంచాయతీ వార్డు నెంబరు మొల్లి గంగాధర్ దంపతులు తహశీల్దారుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆర్ అండ్ బి స్థలంలో ఉన్న టిడిపి అనుచరులు షాప్‌ను బుధవారం రెవిన్యూ వారు పోలీసులు సహకారంతో తొలగించారని, అయితే రావాడ పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో ఉన్నవాటిని అన్నింటిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఆక్రమణ గురైన భూములను పరిరక్షణ కల్పించే విధంగా కృషి చేయాలని, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న, మాజీ ఎంపిటిసి సారిపల్లి జోగి నాయుడు, మొల్లి అప్పల రాజు, వియ్యపు సూర్య చంద్ర అప్పారావు, కారుకొండ పూర్ణ, మొల్లి సంజీవి, కారుకొండ కొనారి, కారుకొండ నరేశ్, బొట్ట సోమినాయుడు, మొల్లి శ్రీను, కారుకొండ అప్పలరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రావాడ గ్రామస్తులు, టిడిపి నేతలు

8న అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ఈనెల 8వ తేదీన అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వైఎన్ భద్రం, అధ్యక్ష కార్యదర్శులు కర్రం మాణిక్యాలరావు, ముల్లేటిగోపాల రమణ తెలియజేశారు. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాధితుల పోరాటానికి అఖిలపక్ష రాజకీయ పార్టీల ప్రజాసంఘాల మద్దతు కూడగట్టుకోవడం కోసం సమావేశం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు జె.దుర్గారావు, పి శేషు, సిహెచ్ మోహన్ రావు, ఏవి నర్సమ్మ, సూరిబాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని, వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో బుధవారం వాయిబోయిన శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతన చట్టం ప్రకారం 26 వేల రూపాయలు జీతం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పుననుసరించి గ్రాట్యూటీని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చినుకులతో చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలో బుధవారం ఉదయం పడిన చెదురు మదురు చినుకులతో వాతావరణం చల్లబడింది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. చల్లని గాలి వీచింది. రైతులు తమ పంటకు ఇటువంటి వర్షం ఉపయోగపడుతుందని తెలిపారు. వడ గాలుల నుండి విముక్తి కలుగుతుందని వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి చినుకులతో వరి విత్తనాలు నాటడానికి అనుకూలంగా ఉంటుందని వరి రైతులు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌ఓ ఆధ్వర్యాన బుధవారం గాంధీనగరం హైస్కూల్ విద్యార్థులతో స్కూల్ దగ్గర నుంచి గుండాల జంక్షన్ వరకు ర్యాలీ చేసి నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ విలీనం పేరుతో పాఠశాల మూసివేతని ఆపాలని, ఇప్పటికే మూసివేసిన పాఠశాలలను వెంటనే తెరవాలని, అనకాపల్లి పరిసర గ్రామీణ, పట్టణ ప్రాంత పాఠశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం, ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, అద్దె భవనాల్లో ఉంటున్న హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలను వెంటనే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ జిల్లా కమిటీ సభ్యులు ఎమ్.జానకిరామ్, డి. జగదీష్ ఏ ఉదయ్ కిరణ్ 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండకు మౌలిక వసతులపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ ఏడాది డిసెంబరు నాటికి బొజ్జన్న కొండకు మౌలిక వసతులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీ డాక్టర్ బీవి.సత్యవతికి వినతి పత్రం అందజేశారు. ఆధ్యాత్మిక బౌద్ధ క్షేత్రం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.7.2 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లు నిధులు విడుదల చేసిన నేపథ్యంలో ఆ పనులు పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంస్థ ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

వృద్ధులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : వృద్ధులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డాక్టర్ జివి.సత్యనారాయణ అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో బుధవారం సీనియర్ సిటిజన్ సర్వసభ్య సమావేశం కేవీ గౌరీపతి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ సత్యనారాయణ వృద్ధులు పాటించవలసిన ఆరోగ్య సూత్రాను తెలియజేశారు. తప్పనిసరిగా నడక వ్యాయామం చేయాలన్నారు. పావాడ సత్యారావు, ఎం కూర్మా రావు జోకులు చెప్పి సభ్యులను నవ్వించారు. జూలై నెలలో పుట్టిన రోజు ఉన్న సభ్యులను సత్కరించారు. బుద్ద అప్పారావు జన్మదినం సందర్భంగా మొక్కలను క్లబ్బు ఆవరణలో నాటారు. ప్రముఖ వ్యాపారవేత్త పాము వెంకటరమణ, సీనియర్ సిటిజన్స్ సంఘంలో తన వంతు విరాళంగా రూ.10 వేలు అందించారు.

నేడు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జూనోసిస్ డే సందర్భంగా స్థానిక గాంధీ నగరం పశు వైద్యశాలలో గురువారం ఉదయం 9 గంటల నుండి పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వెయ్యడం జరుగుతుందని పశుసంవర్ధక అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్బవరం : మండలంలోని సబ్బవరం పశు వైద్యశాల, అంతకాపల్లి, గుల్లేపల్లి, ఆరిపాక పశువైద్య కేంద్రాల్లో పెంపుడు కుక్కలకు గురువారం ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాల వేయడం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ ఏడి ఉషా కుమారి బుధవారం తెలిపారు.

వడ్డాది : గురువారం కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు వడ్డాది వెటర్నీ డాక్టర్ కె శివకుమార్ తెలిపారు. సమీపంలో ఉన్న పశు వైద్యశాలలకు కుక్కలను తీసుకువెళ్లాలని సూచించారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని వెజురువాడ గ్రామంలో బుధవారం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, మండల వ్యవసాయ అధికారి బి శంకర్ గోవింద్ చేతులమీదుగా రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్లి నూకరాజు, చీర శ్రీనివాస్, మైనర్ రాజు, కే బాల సూర్యనారాయణ, జాస్మిన్ పాల్గొన్నారు.

పట్టణ విద్యుత్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో విద్యుత్ సమస్యలపై ప్రజాసంఘాల నాయకులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్‌కి బుధవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఓల్టేజీ, విద్యుత్ కోతలు, అధిక కరెంటు బిల్లులు తదితర సమస్యలను తెలియజేశారు. దీనికి స్పందించిన డిఇఇ లోవోల్టేజీ లేకుండా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విల్లూరి పైడారావు, బొట్టా చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్, బొబ్బిలి గోవింద, వాసుపల్లి తాతీలు, మడక అప్పారావు, బొడ్డు సోమరాజు, బాషా పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి పరికరం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్డు మీద ఉండే స్పీడ్ బ్రేకర్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాన్ని అనకాపల్లి దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థినులు పి.మనోజ్ఞ, డి.మేఘనాంజలి రూపొందించారు. స్పీడ్ బ్రేకర్ వద్ద ఉంచిన సెన్సర్ ద్వారా వాహనం స్పీడ్ బ్రేకర్స్ మీదకు రాగానే సెన్సార్ యాక్టివేట్ అయ్యి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని విద్యార్థులు తెలిపారు. ఈ పరికరాన్ని తయారు చెయ్యడానికి వెయ్యి రూపాయలు ఖర్చు చేసినట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు తెలిపారు. దీనికి గైడ్‌గా ఈసీఈ విభాగాధిపతి ఎన్.సరితారాణి వ్యవహరించారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ఇంఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ కె.పార్వతి, పూర్వ ప్రియ విద్యార్థులను అభినందించారు.

సర్టిఫికెట్ల జారీకి ఇంత హడావుడి అవసరమా?

జగనన్న సురక్ష శిబిరంలో సర్టిఫికెట్లను అందిస్తున్న అధికారులు, నేతలు

◆ జగనన్న సురక్ష అమలు, ప్రచారంపై పలువురి పెదవి విరుపు

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకమంటూ చేపడుతున్న జగనన్న సురక్ష శిబిరాల్లో ఉచితంగా ఇస్తామన్న కులం, ఆదాయం ఇతరత్రా ధ్రువీకరణలకు దరఖాస్తు చేసుకున్న వారే అధికంగా వస్తున్నారు. దీని కోసమే ఇంత హడావిడి, ప్రచారం అవసరమా అని విపక్షాలతో పాటు పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి జూన్ నెలలో విద్యాసంస్థలకు అందజేసేందుకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎక్కువగా అవసరం ఉంటాయి. దీనికోసం కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తిరగాల్సి ఉంటుంది. ఇదే సమయంలో జగనన్న సురక్ష పేరుతో అధికారులు విపరీతమైన ప్రచారం చేస్తూ, ఆయా ధ్రువీకరణలనే గ్రామాలకు వచ్చి శిబిరాల్లో అందిస్తుండడంతో సంబంధిత దరఖాస్తుదారులు వస్తున్నారని అంటున్నారు. 11రకాల ధ్రువీకరణలు ఉచితంగా ఇస్తామన్న ప్రభుత్వం, అధికారయంత్రాంగం ఈ రెండు ధ్రువీకరణలు మినహాయిస్తే, దరఖాస్తుదారులకు జనన మరణ ధ్రువపత్రాలు అందజేయకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలను గ్రామ రెవెన్యూ అధికారి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు జారీ చేసేస్తారు. వీటిల్లో స్వల్ప సమస్యలుంటే జారీలో ఒకింత జాప్యం జరుగుతుందే తప్ప, చాలా వరకు సర్టిఫికెట్ల జారీ ఈజీగానే జరుగుతోంది. దీనికోసం ప్రత్యేకంగా నెలరోజులపాటు ఒక కార్యక్రమాన్ని ప్రకటించి, ప్రచారాలు, ప్రకటనలతో ఆర్భాటం చేయడం ఎందుకనే చర్చ కూడా సాగుతోంది. మండలంలో ఇప్పటివరకు ఆరు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించగా, కుల ఆదాయ ధ్రువపత్రాల కోసమే ఎక్కువ మంది సభలకు చేరుకున్నారు. ఒక్క పందూరు సచివాలయంలో అత్యధికంగా 985 దరఖాస్తులు అందాయి..

నేటికీ డిపోలకు చేరని రేషన్ బియ్యం

స్టాక్‌పాయింట్ నుంచి డిపోలకు వెళుతున్న బియ్యం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని ఎఫ్‌సి గొడౌన్ నుంచి కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లోని రేషన్‌డిపోలకు సరఫరా కావలసిన రేషన్ బియ్యం కొరత కారణంగా నేటికీ డిపోలకు చేరలేదు, మండలంలోని స్టాక్ పాయింట్ నుంచి కోటవురట్ల మండలంలో 38, మాకవరపాలెంలో 48 డిపోలకు ప్రతి నెల 519 టన్నులు బియ్యం సరఫరా చేయాల్సి ఉన్నట్లు గోదాము ఇన్‌చార్జి ఈశ్వరరావు తెలిపారు, గోదాములో స్టాకు అందుబాటులో లేకపోవడంతో డిపో సరుకు ఆలస్యంగా సరఫరా అవుతున్నట్లు తెలిపారు. ఇంకా 108 టన్నులు బియ్యం సరఫరా చేయాల్సి ఉందన్నారు. దీంతో డీలర్లు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

శిథిల భవనంలో చదువులు!

◆ పెచ్చులూడిన పైకప్పుతో క్షణక్షణం భయంభయం

◆ ఆందోళనలో తల్లిదండ్రులు .. పట్టించుకోని అధికారులు

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం పైకప్పు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో మైదాన ప్రాంత గిరిజన గ్రామం ఎంకె.పట్నం శివారు గ్రామం పెదపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు పిల్లలపై పడిపోతుందని పిల్లల తల్లిదండ్రులు, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ఆందోళన చెందుతున్నారు. భవనంలో రెండు గదులు ఉంటే, ఒక గదిలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు, రెండవ గదిలో అంగన్వాడీ పిల్లలు విధ్యనభ్యసిస్తున్నారన్నారు. ఒక గదిపై వాటర్ ట్యాంక్ అమర్చారు. దాని కారణంగా శ్లాబ్ తేమ పట్టి, శిథిలావస్థకు చేరింది. అంగన్వాడీ భవనం ఐదు సంవత్సరాలుగా పునాది స్థాయిలోనే ఉంది. ఈ కారణంగా పెచ్చులూడిన బిల్డింగ్‌లోనే పిల్లలు చదువుకుంటుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పాఠశాల భవనం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అలాగే పునాదుల స్థాయి దాటని అంగన్వాడీ భవనం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్‌బికెలతో రైతుల సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి -కోటవురట్ల: రైతులు, సాగుకు సంబంధించిన అనేక సమస్యలు రైతు భరోసా కేంద్రాలతో పరిష్కారమౌతున్నాయని చినబొడ్డేపల్లి సర్పంచ్ శివరాం అన్నారు. బుధవారం రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుతో విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందులు సమస్య తీరిందని అన్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సచివాలయ పరిధిలో గ్రామాల రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కొత్తపల్లి వద్ద వాహనతనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - చీడికాడ : వాహనదారులకు లైసెన్స్ లేకున్నా, వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేయడం తప్పదని ఎఎస్ఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.. చీడికాడ మండలం జి కొత్తపల్లి గ్రామం వద్ద ఎఎస్ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, వాహనపత్రాలన్నీ అప్‌డేట్‌గా ఉండాలని సూచించారు. ప్రతిఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ఉల్లంఘిస్తే జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ మంగమ్మ సిబ్బంది పాల్గొన్నారు

ధరాభారంపై ఐద్వా ఆందోళన

ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

ప్రజాశక్తి - హుకుంపేట : ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు బుధవారం హుకుంపేట మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్యతరగతి ఏమీ కొనలేని పరిస్థితుల్లో బతుకు దుర్భరంగా గడుపుతున్నారన్నారు. గత నెలలో రూ.40లోపే ఉన్న టమోటా కిలో ఇపుడు రూ.140లకు చేరిందని, ఇతర కూరగాయల ధరలన్నీ కిలో వంద రూపాయలే పలుకుతుంటే పేదలు ఏంకొని, ఏం తినాలని ప్రశ్నించారు. పప్పులతో అన్ని నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అదుపు చేసి సామాన్యులకు ఉపశమనం కల్పించే చర్యలు ప్రభుత్వమే వెంటనే తీసుకోవాలని కోరారు. కందిపప్పు కిలో ధర రూ.150లకు పెరిగిపోగా, రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న కందిపప్పును కూడా గత రెండు నెలలుగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల నేపథ్యంలో 14 రకాల నిత్యవసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా రాయితీ ధరలపై అందించాలని, ధరల పెరుగుదలకు కారణాలపై దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టడంతోపాటు బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు సుహాసిని, వనం, మణెమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

7లోగా ప్రవేశాలు పొందాలి

ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- చీడికాడ : ఎపి మోడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతులలో ఖాళీ సీట్ల భర్తీని నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 7లోగా సంబంధిత పాఠశాలలో తరగతుల్లో చేరాలని స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ప్రవేశ పరీక్ష ఫలితాలు, ఎంపికైన విద్యార్థుల జాబితాను మోడల్ స్కూల్‌లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ పేర్లను సరిచూసుకుని ఈనెల 7న, శుక్రవారం నాటికి జాయినింగ్‌కు అవసరమగు అన్ని పత్రాలను తీసుకుని హాజరుకావాలని ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి సూచించారు.

నేడు సత్తెమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గురువారం సత్తమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త ఎన్ రాజుబాబు తెలిపారు. చింతలపాటి కుటుంబీకులు ఆధ్వర్యంలో ఏటా ఆషాడ మాసంలో అమ్మవారి పండుగను నిర్వహిస్తారు. అమ్మవారు పండుగ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కమిటీ సభ్యులు తెలిపారు .

యువత క్రీడాసక్తి పెంచుకోవాలి

క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న కృష్ణ

ప్రజాశక్తి-మాడుగుల: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జనసేన నేత రాయపురెడ్డి కృష్ణ అన్నారు. బుధవారం కృష్ణంపాలెం పంచాయతీ యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. .గతంలో వాలీబాల్ కిట్టు పలువురు క్రీడాకారులకు అందజేశానని, అప్పట్లో క్రికెట్ కిట్లు కావాలని పలువురు కోరడంతో ఈ మేరకు వాటిని పంపిణీ చేస్తున్నట్లు కృష్ణ వెల్లడించారు. కార్యక్రమంలో రాజారెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు

డ్రెయిన్లు, రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 51వ వార్డు పరిధి మాధవధార వుడా క్వార్టర్స్‌లో రూ.20 లక్షల వ్యయంతో డ్రెయిన్లు, రోడ్లు, మహాత్మా కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు వార్డు కార్పొరేటర్ రేయ్యి వెంకటరమణ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడపగడప మన ప్రభుత్వం లో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ఈ సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. డిఇ భరణి, 51వ వార్డు నాయకులు తిరుమలరావు, రత్నం, వరలక్ష్మి, ధర్మవతి, రాజేశ్వరరావు, శ్యామ్, గణేష్, రాణి, వినోద్, ధర్మేంద్ర, త్రినాధ్ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 26వ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు లాంటివన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రజలకు సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ వైసిపి 26వ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, 42వ వార్డు కార్పొరేటర్ లీలావతిశ్రీనివాసరావు, ఇఇ శ్రీనివాసరావు, పాండవ శ్రీనివాసరావు, సమ్మెట్ల వెంకటేష్, గోవిందు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు నేడు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

ప్రజాశక్తి- మాడుగుల: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈనెల 6న గురువారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేయనున్నట్లు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టి నాయుడు తెలిపారు. పెంపుడు కుక్కలకు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా టీకాలు వేస్తామని, పెంపకందారులు వినియోగించుకోవాలని కోరారు

కొత్తకోట : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈనెల 6న గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకుకొత్తకోట పశువైద్య శాల ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ జి.బాలతేజ తెలిపారు. జంతువుల వలన మనుషులకు సంక్రమించే వ్యాధుల నివారణలో భాగంగా ప్రభుత్వం ఈ టీకాలు వేయిస్తోందని,పెంపుడు కుక్కల యజమానులందరూ సహకారించాలని కోరారు.

రోలుగుంట : ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా ఈనెల 6న గురువారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు పెంపుడు కుక్కలకి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని రోలుగుంట పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు, కుసర్లపూడి పశు వైద్యాధికారి సురేష్ తెలిపారు. పెంపకందారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఇఒ-2గా వెంకటరమణ

వెంకటరమణను అభినందిస్తున్న ఉపాధ్యాయసంఘాల నేతలు

ప్రజాశక్తి – చీడికాడ : చీడికాడ మండల ఎంఇఒ–2గా బత్తి వెంకటరమణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఎంఇఒను చీడికాడ ఎపిటిఎఫ్, పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జిపిఎ. నాయుడు, శ్రీనివాస్, పాటూరి వరాహమూర్తి స్వాగతించి, దుశ్శాలువాతో సత్కరించారు. అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సన్యాసినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎంఎల్ నాయుడు, మండల కార్యదర్శి పివరాహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.కాగా కొత్త ఎంఇఒ వెంకటరమణ గతంలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసారు. తర్వాత ఖండివరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా,అలాగే జాతీయ స్థాయిలో కోచ్‌గా, మేనేజర్‌గా విధులు నిర్వహించారు. పెదగోగాడలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి చీడికాడ ఎంఇఒగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణపతి, జై, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి – రావికమతం : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పింఛను తీసుకునేందుకు గ్రామానికి రాలేని లబ్ధిదారునికి ఆసుపత్రికి వెళ్లి, పింఛను అందజేసి వాలంటీరు సేవాభావాన్ని చాటుకున్నారని సర్పంచు దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. మండలంలో కవగుంట పంచాయతీలో వితంతు పింఛను లబ్ధిదారు మధురవాడ కృష్ణమ్మ అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతోంది. పెన్షన్ సొమ్ము తీసుకోవడానికి గ్రామానికి రాలేని పరిస్థితుల్లో ఉండటంతో స్వయంగా వాలంటీర్ గోగం సింహాచలం ఆసుపత్రికి వెళ్లి పింఛను రూ.2,750 అందజేశాడు. దీంతో లబ్ధిదారు కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. వాలంటీరు సేవాభావాన్ని సర్పంచ్‌తోపాటు పలువురు అభినందించారు.

కొత్తకోట: ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై విశాఖ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్తకోటకు చెందిన లబ్ధిదారు ఎల్లేటి ప్రకాష్ ఆసుపత్రికి వెళ్లిసామాజిక పింఛన్ అందజేసిన గ్రామ వాలంటీర్ శీలం రాజేష్, వేమవరపు తేజలను గ్రామస్తులు అభినందించారు. బుధవారం విశాఖపట్నం ఆరిలోవలో ఆసుపత్రికి వెళ్లి ప్రకాష్ యోగ క్షేమాలు తెలుసుకొని పింఛన్ సొమ్ము అందజేశారు.

‘సురక్ష’తో సంక్షేమం, సమస్యల పరిష్కారం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ..పలుచోట్ల ‘జగనన్న సురక్ష’

కొత్తకోటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

జీవిఎంసి, విశాఖ జిల్లా పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పలు ధ్రువీకరణలను ఉచితంగా పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజాశక్తి -కొత్తకోట: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాలలో వేలాది సమస్యలు ఒక రోజులో పరిష్కారమౌతున్నాయని, వాటిని పార్టీల కతీతంగా జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అన్నారు. బుధవారం కొత్తకోట సచివాలయం-1 మేడివాడ గ్రామాలలో జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. బుధవారం కొత్తకోటలో 1,156, మేడివాడ 515 సమస్యలను పరిష్కరించారు. కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు, సత్యదేవ, ఎంపిటిసి పూడి దేవ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, నేతలు శీలం శంకరరావు, గుమ్ముడు దొరబాబు, కుంచా శంకరరావు, మేడివాడలో మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఎంపిటిసి గొర్లె సత్యారావు, ఉప సర్పంచ్ వజ్రపు శివ, పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి కోటేశ్వరరావు, తహశీల్దార్‌మహేశ్వరరావు, ఎంపిడిఓ వెంకన్నబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించామని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని చందనాడ, దేవవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి త్రినాథరావు, ఎంపిపి రత్నం, జెడ్‌పిటిసి కాసులమ్మ, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డివెంకటనారాయణ, డిటి నీరజ ,పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు వైసీపీ నేతలు మణి రాజు, పాపారావు, గొర్ల నరసింహమూర్తి, గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, గొర్ల బాబురావు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు , తహశీల్దార్ జానకమ్మ అధ్యక్షతన రెండు వేర్వేరు బృందాలు బుధవారం మూడోరోజున లింగాపురం, పందూరు, సచివాలయ పరిధిలో గ్రామాలలో జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రకాల ధ్రువపత్రాలను శిబిరాల్లో దరఖాస్తుదారులకు అందజేశారు. శిబిరాలను సందర్శించిన మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ పథక తీరును పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సోమశేఖర్, ఇఒపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, మండల. గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని పాకలపాడు సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరంలో జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు పాల్గొని పలువురికి సర్టిఫికేట్లు అందజేశారు. సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాసులు, మండల వైసిపి యూత్ అధ్యక్షులు రామకృష్ణనాయుడు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, స్థానిక సర్పంచ్ రాజన్న పద్మావతి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పత్తి రమణ, పాల్గొన్నారు. ఏఎల్‌పురంలో గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనందరావు, వైసిపి మండలాధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి రఘురాం పాల్గొన్నారు

కశింకోట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, ఎమ్‌పిటిసి లగిశెట్టి భవానీ, అద్దంకి సతీష్, ఎమ్‌పిడిఒ రవికుమార్, కార్యదర్శి వెంకట లక్ష్మీ, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, చిన్ని వల్లభ నారాయణరావు పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జెడ్‌పి వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు అన్నారు. మండలంలోని అసకపల్లి, పైడివాడ అగ్రహారం గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, కాపుసెట్టి శేషుబాబు, తహసీల్దార్ బి..సత్యనారాయణ, ఎంపిడిఓ బి రమేష్ నాయుడు, సర్పంచ్‌లు కర్రి నరసింగ రావు, బలిరెడ్డి కనకరాజు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, పెచ్చెట్టి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

కరాస: జీవిఎంసి 52వ వార్డు పరిధి శాంతినగర్ సచివాలయం వద్ద 310, 311, 312, 313 వార్డు సచివాలయాలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ధ్రువపత్రాల కోసం కష్టాలు పడకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. గతంలో సాంకేతిక సమస్యల కారణంగా జారీకాని ధ్రువపత్రాలను ఇప్పుడు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జగనన్న సురక్ష ద్వారా లబ్ధిపొందిన వారికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. తహశీల్దార్ కొర్ర జయ, ఎపిడి, సిఇ సుధారాణి, స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవివర్మ, ఆల్టా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 43వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లోని దాడి రామూర్తి కళ్యాణ మండపం వద్ద "జగనన్న సురక్ష" క్యాంపు నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొని లబ్ధిదారులకు సంబంధిత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 43వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఇఇ శ్రీనివాస్, ఎపిడి పద్మావతి, ఎఇ రమణమ్మ, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, ఆర్‌ఐ ఇబ్రహీం, విఆర్‌ఒ నాగేశ్వరరావు, 43వ వార్డు నాయకులు జక్కంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. బోని గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ సెటిల్ భూముల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యప్రభ, తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడప లవరాజు, నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి మహేష్, మండల ప్రెసిడెంట్ బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ బోని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీత

జగనన్న సురక్ష కార్యక్రమంలో పలు సమస్యలపై గ్రామస్తులు నిలదీశారు. వాలంటీర్లు, గ్రామ కార్యదర్శి వల్ల జగనన్న ఇళ్ల గ్రామంలో ఏ ఒక్కరికీ రాలేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చిన దరఖాస్తులను వారు చెత్తబుట్టలో పడేస్తున్నారని ఆరోపించారు. కుశలవాడలో సమగ్ర భూ సర్వే మధ్యలోనే ఆపివేశారని వీటిని త్వరగా పూర్తిచేసి పట్టాదారు పాస్ పుస్తకాలతో పాటు గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. రోడ్లు, తాగునీరు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఒత్తిడి లేని జీవితం గడపాలి

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి

మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి

ప్రజాశక్తి– గాజువాక : ఉద్యోగ విరమణ అనంతరం ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం గడపాలని స్టీల్‌ప్లాంట్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి సూచించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేసి ఇటీవల విరమణ పొందిన వి.రామారావుకు, సన్యాసయ్యకు కలిపి సమాఖ్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం రాత్రి తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో సన్మానించారు. సన్మానానికి ముందుగా ఏర్పాటుచేసిన సభలో రామస్వామి మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు నిర్మాణానికి రామారావు, సన్యాసయ్య చేసిన సేవలను గుర్తు చేశారు. 2021లో కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని నిర్ణయించి, మూడు కమిటీలను వేసినా నేటి వరకు ఒక్క కమిటీని కూడా ప్లాంట్‌లో అడుగుపెట్టనీయకుండా అడ్డుకున్నామని తెలిపారు. పోస్కోకు అమ్మాలని గతంలో ప్రయత్నించినప్పుడు అడ్డుకున్నామన్నారు. 2000 సంవత్సరంలో కూడా ఇదే ప్రయత్నం చేస్తే అప్పుడు కూడా అడ్డుకున్నామని గుర్తుచేశారు. యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గొప్ప స్థానం ఉందన్నారు. అలాంటి విశాఖ ఉక్కులో పనిచేసి విరమణ పొందిన కార్మికులను అభినందించారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షుతన జరిగిన సన్మాన సభలో అసోసియేషన్ కార్యదర్శి తవిటయ్య, తౌడన్న, చిన్నంనాయుడు, కోశాధికారి రమణ, మహిళా కమిటీ నాయకులు పాల్గొన్నారు. వారిద్దరికీ రామస్వామి, వైటి.దాసు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల సమక్షంలో శాలువా కప్పి సన్మానం చేశారు. మహిళా కమిటీ నాయకులు పుష్పగుచ్చం అందించారు.

చోరీ కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి : నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో 2020 అక్టోబర్ 27న జరిగిన చోరీ కేసులో ముద్దాయికి మూడు సంవత్సరాల కారాగార శిక్ష ఎలమంచిలి ఏజెఎఫ్ సీఎం కోర్టు విధించింది. ఎస్పీ కార్యాలయం అందించిన వివరాల ప్రకారం ఉద్దండపురం గ్రామానికి చెందిన కొంతం నూకరత్నం 2020 అక్టోబర్ 27న మధ్యాహ్న సమయంలో మాట్లాడేందుకు పక్కింటికి వెళ్ళింది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళం బీరువా తాళం పగలగొట్టి మూడున్నర తులాల బంగారు వస్తువులతో పాటు ఐదు తులాల వెండి పట్టీలను అపహరించుకుపోయారు. దీనిపై ఆమె నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 2021 మార్చి 24న నల్గొండ జిల్లా మిర్యాలగూడ రామ్‌నగర్‌కు చెందిన బసవరాజు శ్రీనివాస్ పలు ప్రాంతాల్లో చోరీలు చేసిన నగలను గుంటూరు జిల్లా పత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అమ్మే క్రమంలో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఉద్దండ పురంలో ఐదు తులాల వెండి పట్టీలను దొంగిలించినట్లు అంగీకరించాడు. దీనిపై విచారణ చేసిన మేరకు ముద్దాయికి మూడు సంవత్సరాల కారాగారు శిక్ష విధించినట్లు తెలిపారు. దర్యాప్తు అధికారి ఎస్సై జి.శిరీష, వాదనలు వినిపించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.జ్యోతిసుధను ఎస్పీ కెవి.మురళీకృష్ణ అభినందించారు.